సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 18 । మార్చి । 2024



ఆల్ ది బెస్ట్

జి.సిగడాం: పదో తరగతి విద్యార్థులు ఈ రోజు నుంచి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా స్థానిక కేజీబీవీ విద్యార్థులకు సిబ్బంది సలహాలు, సూచనలు ఇచ్చి ఆల్ ది బెస్ట్ తెలిపారు. జిల్లాలో ఉన్న టెన్త్ విద్యార్థులంతా పరీక్షలు బాగా రాయాలని ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు ఆకాంక్షిస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ	మంగళ
సాయంత్రం	ఉదయం
6.09	4.45

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్ష



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో గ్రూప్‌–1 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్థానిక శ్రీ చైతన్య స్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. జేసీ ఎం.నవీన్ ప్రభుత్వ మహిళా కళాశాల రోడ్డులో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షల అమలును పరిశీలించారు. ఉదయం పూట 6403 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 4124 మంది హాజరయ్యారు. 2279 మంది గైర్హాజరయ్యారు. రెండోపూట కూడా 6403 మంది హాజరు కావాల్సి ఉండగా 4088 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 2315 మంది గైర్హాజరయ్యారు.

స్పందన రద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు డీఆర్‌ఓ ఎం.గణపతిరావు తెలిపారు. కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేశామని, ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత తదుపరి తేదీ ప్రకటిస్తామని తెలిపారు.

గేట్‌లో మెరిసిన పేదింటి బిడ్డ



ఆబోతు నీలాద్రి

ఇచ్ఛాపురం రూరల్: మండలం తులసిగాం పంచాయతీ ఎ.బలరాంపురం గ్రామానికి చెందిన ఆబోతు నీలాద్రి ఆదివారం విడుదలైన గేట్‌–2024 ఫలితాల్లో ఆల్‌ఇండియా 343వ ర్యాంకు సాధించాడు. స్వగ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు చదివిన నీలాద్రి కవిటి మండలం రాజపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి పది పాయింట్లు సాధించి నూజివీడులో ఐఐఐటీ పూర్తి చేశాడు. 2022, 2023 గేట్ పరీక్ష కోసం ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా కేవలం యూట్యూబ్ ప్రిపరేషన్‌తో సిద్ధమయ్యాడు. రెండు పర్యాయాలు విఫలం కాగా, మూడో ప్రయత్నంగా స్నేహితుడు శంకర్ ప్రోత్సాహంతో 2024లో ఉత్తమ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఆబోతు చిత్రసేను, అన్నపూర్ణలు పట్టలేని ఆనందం వ్యక్తం చేశారు.

'హరిసూర్యప్రకాష్ సేవలు వెలకట్టలేనివి'



హరిసూర్యప్రకాష్ దంపతులను సత్కరిస్తున్న డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయం అత్యంత వేగంగా అభివృద్ధి చెందడానికి ప్రధాన కారకుడు ఈఓ వి.హరిసూర్యప్రకాష్ అని అరసవల్లి ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ కొనియాడారు. స్థానిక ఆలయ అనివెట్టి మండపంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన హరిసూర్యప్రకాష్ వీడ్కోలు, అభినందన సభలో చంద్రశేఖర్ మాట్లాడారు. ఆదిత్యాలయం వేగంగా అభివృద్ధి చెందిన కారణంగానే ఆలయానికి డీసీ హోదా లభించిందన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రసాద్ పట్నాయక్, పాలకమండలి సభ్యులు ఆధ్వర్యంలో హరిసూర్యప్రకాష్, భార్య హేమ దంపతులను సత్కరించారు. దశాబ్దాలుగా చూడని ఆదిత్యుని స్వర్ణాలంకరణ దర్శనం ఈఓ హరిసూర్యప్రకాష్ కృషితోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మండవల్లి రవి, సోమేశ్వరరావు, అనురాధ, లక్ష్మి, శ్రీనివాస్, గోవిందరావు, గనిరాజ్, స్థానికులు ఉంగటి పాపారావు, గాయత్రి, ద్వారపు అజిత్ తదితరులు పాల్గొన్నారు.

రాజమ్మ తల్లి సన్నిధిలో..



రాజమ్మ తల్లి

గార: వత్సవలసలో కొలువైన్న రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి భక్తులు నాల్గో ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. శనివారం రాత్రి వచ్చిన భక్తులు బసచేసి రాజరాజేశ్వరి (రాజమ్మతల్లి) పాటు భూలోకమ్మ తల్లికి ఆదివారం ఉదయం మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలాచరించారు. శ్రీకూర్మం కూడలి వద్ద నుంచి తూలుగు, ఎర్రగుడ్డి మీదుగా మరలా శ్రీకూర్మం వరకు వన్‌వే ఏర్పాటు చేయడంతో వందలాది వాహనాలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు.

సై



- ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ప్రకటనతో వైఎస్సార్‌సీపీలో జోష్
- సరైన అభ్యర్థులను ఎంపిక చేశారంటూ హర్షాతిరేకాలు

సమర్థత, విధేయత.. రెండే తారక మంత్రాలు. అనుభవం, అభిమానం.. రెండే అర్హతలు. నిజాయితీ, నిబద్ధత.. ఇవే కొలమానాలు. సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి వైఎస్సార్ సీపీ సైన్యం సిద్ధమైంది. జిల్లాలోని ఎనిమిది నియోజకవరాలు, ఒక పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ప్రకటించింది. సమరానికి సరైన వారినే ఎంపిక చేశారని సర్వత్రా అభినందనలు అందుతున్నాయి. అపార అనుభవం గల తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు వంటి నేతలతో పాటు కొత్తగా ఎమ్మెల్యే స్థానానికి పోటీ పడుతున్న పిరియా విజయతో కలిపి జిల్లా వైఎస్సార్ సీపీ జట్టు విపక్షాలతో పోల్చితే ఓ మెట్టు పైనే ఉంది.



● సాఫ్ట్‌వేర్ టు పాలిటిక్స్





పిరియా విజయ

సామాన్యగృహిణి నుంచి భర్త, మామ అడుగు జాడల్లో రాజకీయాల్లోకి ప్రవేశించడం, జెడ్పీ చైర్ పర్సన్‌గా తనదైన పనితీరు కనబరచడం, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక కావడం వరకు పిరియా విజయ ప్రస్థానం ఓ సిని మా కథను తలపిస్తుంది. పిరియా సాయిరాజ్ భార్యగా అందరికీ చిరపరిచితురాలైన పిరియా విజయ కవిటి మండల జెడ్పీటీసీగా ఎన్నికయ్యాక జెడ్పీ చైర్ పర్సన్ పదవికి ఎంపికయ్యారు. ఇప్పుడు ఇచ్ఛాపురం అసెంబ్లీ సీటు కేటాయించారు. ఆమె పనితీరుకు దక్కిన ఫలితమిది. ఆమె 2001 నుంచి 2009 వరకు హింద్ ఇన్ఫో వే సాఫ్ట్‌వేర్ కంపెనీకి డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2009 నుంచి 14 మధ్యలో సోంపేట థర్మల్ పవర్‌ప్లాంట్ ఉద్యమంలో నిరసన కార్యక్రమాల్లో భర్త సాయిరాజ్‌తో కలిసి కీలకంగా వ్యవహరించారు. అంతేకాకుండా ఉద్దానం ఫౌండేషన్ ట్రస్టీగా ఉంటూ ఉచిత అంబులెన్స్ సర్వీసులను న డుపుతూ రోగులకు సేవలందించారు. కిడ్నీ వ్యాధి తో మృతిచెందిన తల్లిదండ్రుల పిల్లలను దత్తత తీసుకొని వారికి చదువులు చెప్పిస్తున్నారు. ఆమెతోపాటు భర్త సాయిరాజ్, మామ రాజారావులు సైతం ప్రజాసేవలో తమవంతు పాత్రను పోషిస్తూ నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతున్నారు. –కంచిలి

● ప్రత్యేక పనితీరు






రెడ్డి శాంతి

కుటుంబానిది రాజకీయ నేపథ్యమే అయినా తనకంటూ ఓ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు రెడ్డి శాంతి. ఆ ప్రత్యేకతే ఆమెను రెండోసారి ఎమ్మెల్యేగా ఖరారు చేసేలా చేసింది. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే ప్రాణం. 2014 ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయాలని జగనన్న చెబితే పోటీ చేసి ఓటమి చెందినా దిగులు చెందలేదు. 2016లో పాతపట్నం ఎమ్మెల్యే కలమట పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే పాతపట్నం వెళ్లి అక్కడి ప్రజలకు పార్టీ సేవలు అందించాలని జగనన్న ఆదేశిస్తే శిరసా వహించారు. జగనన్న దూతగా వచ్చానని చెప్పుకుని ఢిల్లీ నుంచి వచ్చి గల్లీగల్లీల్లో తిరిగారు. 2019 జగనన్న ఆదేశాల మేరకు పాతపట్నం ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 2024 ఎన్నికలలోనూ పోటీకి సిద్ధమయ్యారు. ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చిన రెడ్డి శాంతి పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాల్లోను గత ఐదేళ్ల పాలనలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు.– ఎల్.ఎన్ పేట

● పార్టీ అంటే ప్రాణం





ధర్మాన కృష్ణదాస్

రైతు కుటుంబానికి చెందిన ధర్మాన కృష్ణదాస్ వైఎస్ కుటుంబం మెచ్చిన వ్యక్తి. చిన్నపాటి ఉద్యోగం వదిలి 2004 లో అప్పటి సీఎల్‌పీ లీడర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి నుంచి కృష్ణదాస్ నరసన్నపేట నియోజకవర్గంలో, జిల్లాలో ఎదురులేని నాయకుడిగా ఎదిగారు. ఈ నియోజకవర్గం నుంచి నాలుగుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈయన ఇప్పుడు ఆరో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయనున్నారు. కృష్ణదాస్ 2004 నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2012లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే పదవికి మొదటగా రాజీనామా చేశారు. ఆ తర్వాత ఉప ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిచారు. 2014 లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. 2019లో భారీ మెజారిటీతో గెలిచారు. అనంతరం డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా 8 సీట్లలోనూ గెలిపించే బాధ్యత తీసుకున్నారు. –నరసన్నపేట

● సుదీర్ఘ సేవకుడు





తమ్మినేని సీతారాం

స్పీకర్ తమ్మినేని సీతారాంకు మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో పో టీ చేసేందుకు అవకాశం లభించింది. తమ్మినేని సీతారాం తండ్రి తమ్మినేని శ్రీరామ్మూర్తి అప్పట్లో ఆయనను ఐపీఎస్ చదుకోవాలని చెబితే రాజకీయం వైపు వెళ్లారు. సీతా రాం పెద నాన్న తమ్మినేని పాపారావు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయన బాటలోనే ప్రజా సేవ చేయాలనే భావనతో ముందుకువచ్చారు. తమ్మినేని సీతారాం 1982లో రాజకీయ రంగప్రవేశం చేశారు. 24 ఏళ్ల వయస్సులో రాజకీ య రంగంలోకి ప్రవేశించి అతి చిన్న వయస్సులో 1983లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. తన రాజకీయ జీవితంలో తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేయగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా వరుస విజయాలు సాధించి ఆమదాలవలస నియోజకవర్గంలో చెరగని ముద్ర వేసుకున్నారు. అప్పట్లో తొమ్మిదేళ్లపాటు ప్రజలకు ఎన్నో రకాలుగా సేవలు అందజేశారు. అతి చిన్న వయస్సులోనే రాజకీయ రంగంలోకి వ చ్చి రాష్ట్రంలో సంచలనం సృష్టించారు. 2013లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన తమ్మినేని 2014లో ఓడిపోయి.. 2019లో ఎమ్మెల్యే విజయం సాధించారు. ప్రస్తుతం మరో సారి ఆమదాలవలస నియోజకవర్గంలో బరిలో నిలుస్తున్నారు. –ఆమదాలవలస రూరల్

● అపార అనుభవం





ధర్మాన ప్రసాదరావు

రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావుకు మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని సీఎం వై ఎస్ జగన్ కల్పించారు. అంతే కాదు రాష్ట్రంలోని 175 శాసనసభా స్థానాలకు వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేసే అభ్యర్థుల పేర్లను కూడా మంత్రి ధర్మాన ద్వారా ముఖ్యమంత్రి చదివించారు. జిల్లాలో సుదీర్ఘ అనుభవం ఉన్న నేతగా ధర్మాన ప్రసాదరావు అందరికీ చిరపరిచితులు. 1981లో మబగాంలో సర్పంచ్‌గా తొలిసారి పీఠం అధిరోహించిన నాటి నుంచి నేటి కేబినెట్‌లో రెవె న్యూ మంత్రి వరకు సాగిన ఆయన ప్రస్థానం ఆదర్శప్రాయం. సునిశిత దృష్టితో అభివృద్ధి చేయడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేయడం ధర్మాన ప్రత్యేకత. జిల్లాలో రిమ్స్, బీఆర్‌ఏ యూ, వంశధార ప్రాజెక్టు వంటి కీలక ప్రగతి పను ల్లో ధర్మాన భాగస్వామ్యం ఉంది. శ్రీకాకుళం నగరానికి రక్షిత మంచి నీటి పథకం, పొన్నాడ బ్రిడ్జి, ఏడు రోడ్ల కూడలి, డేఅండ్‌నైట్ జంక్షన్‌లో నాగావళి నదిపై వంతెనలు, మార్కెట్ ఆధునికీకరణ వంటి పనులెన్నో ఆయన ఆధ్వర్యంలోనే జరిగాయి. –శ్రీకాకుళం

● సమర్థతకు పట్టం





సీదిరి అప్పలరాజు

పలాస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మరోసారి ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు ఎంపికయ్యారు. వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ గ్రామానికి చెందిన ఆయన మత్స్యకార కుటుంబానికి చెందినవారు. పది, ఇంటర్‌లలో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్ చదువు పూర్తి చేశారు. 25 ఏళ్ల అతిచిన్న వయసులో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్‌గా విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయన 14 డిసెంబర్ 2007 నుంచి పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో సేఫ్ హాస్పిటల్ ప్రారంభించి మంచి హస్తవాసి కలిగిన వైద్యునిగా పేరు గడించారు. తాగునీరు సమస్యతో బాధపడుతున్న అనేక గ్రామాలకు తన సొంత నిధులతో పవర్ బోర్లు, మినరల్ వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేసి అనేక మంది ప్రజల దాహార్తిని తీర్చారు. పోటీ చేసిన తొలిసారే గౌతు కుటుంబాన్ని ఓడించిన ఖ్యాతినార్జించారు. మంత్రిగా కూడా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారు. గడిచిన ఐదేళ్లలో పలాస రూపురేఖలు మార్చారు. – కాశీబుగ్గ

● అందరివాడు



గొర్లె కిరణ్‌కుమార్




ఎచ్చెర్ల నియోజక వర్గంలో గొర్లె కిరణ్‌కుమార్ అందరివాడుగా పేరు సంపాదించుకున్నారు. ఈయన 2011 నుంచి వైఎస్సార్ సీపీలో కొనసాగారు. పార్టీ ప్రారంభంలో చేరి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. దీంతో 2013లో ఎచ్చెర్ల నియోజక వర్గ సమన్వయ కర్తగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. గొర్లె కిరణ్ తండ్రి సూర్యనారాయణ నాయుడు, పెద్దనాన్న శ్రీరాములునాయుడికి రాజకీయ వర్గాల్లో చక్కటి కీర్తి ఉంది. దీంతో వారి వారసుడిగా రంగ ప్రవేశం చేసి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారు. 2014 ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఎమ్మెల్యేగా ఓడినా నిరంతరం ప్రజల్లో ఉన్నారు. 2019లో విజయం సాధించాక గ్రామీణ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం నాలుగు మండలాల్లో సైతం పూర్తిస్థాయి పరిచయాలు ఉన్నాయి. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ప్రతిష్టాత్మకం నిర్వహించారు. భార్య పరిమల సైతం ప్రభుత్వ కార్యక్రమాలను జనాల్లోకి తీసుకెళ్లారు. – ఎచ్చెర్ల క్యాంపస్

● సామాన్యుడికి అందలం



పేరాడ తిలక్



వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను ఖరారు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పార్టీ బలోపేతానికి కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందనే విషయానికి తిలక్ ఎంపికే ఓ నిదర్శనం. వైఎస్సార్‌సీపీలో జిల్లా యువజన అధ్యక్షుడి నుంచి గత ఎన్నికల్లో టెక్క లి ఎమ్మెల్యే అభ్యర్థిగా, ఈ రోజు ఎంపీ అభ్యర్థి స్థాయికి తిలక్ ఎదిగారు. కాళింగ సామాజిక వర్గానికి చెందిన తిలక్ రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా సేవలు అందజేసే క్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి మంచి పట్టు సాధించారు. తిలక్ కష్టపడే తత్వాన్ని గుర్తించిన అధిష్టానం ఆయనకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చింది. గత సార్వత్రిక ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీకి చెందిన అచ్చెన్నాయుడుకు ముచ్చెమటలు పట్టించారు. ఓ సామాన్యుడిగా ఉన్న తనకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తిలక్ ఈ సందర్భంగా వెల్లడించారు. –టెక్కలి

● అచ్చెన్నకు కళ్లెం వేయడానికి..



దువ్వాడ శ్రీనివాస్



రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్ పేరును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరారు చేశారు. ఈ నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడుకు కళ్లెం వేయగల సత్తా ఒక్క దువ్వాడ శ్రీనివాస్‌కే ఉందని స్థానికులు విశ్వసిస్తారు. 2019 ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందినప్పటికీ, అచ్చెన్నాయుడుతో పాటు టీడీపీ కార్యకర్తల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తూ నిరంతం ప్రజా సమస్యలపై స్పందిస్తూ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడంలో దువ్వా డ సక్సెస్ అయ్యారు. ఈ నియోజకవర్గంలో పోర్టు అనేది సుమారు 70 ఏళ్ల నాటి కల. అలాంటి కలను సాకారం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సుమారు రూ.4361.91 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ పోర్టును తీసుకురావడంలో దువ్వాడ శ్రీనివాస్ కీలకంగా వ్యవహరించారు. అంతే కాకుండా టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లో సుమారు రూ.1600 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. గత ఓటమి అనుభవాలతో ఈ సారి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అచ్చెన్నాయుడును చిత్తుగా ఓడించడానికి ఇప్పటికే దువ్వాడ శ్రీనివాస్ సరికొత్త ప్రణాళికతో సిద్ధంగా ఉన్నారు. –టెక్కలి



● ఊరు హోరెత్తింది

పలాస కిక్కిరిసిపోయింది. జామి ఎల్లమ్మ తల్లి జాతర సందర్భంగా లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనంతో ఊరిలోని దారులన్నీ ఇలా హోరెత్తాయి. – కాశీబుగ్గ

● ముగిసిన సామూహిక వివాహ వేడుక



నవవరుడి మెడలో సూత్రం కడుతున్న నవవధువు



నవ వధువు మెడలో మంగళసూత్రం కడుతున్న నవవరుడు

జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవులో ఈ నెల 15న ప్రారంభమైన సామూహిక వివాహ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. శనివారం అర్ధరాత్రి 1.56 నిమిషాలకు బ్రహ్మ ముహూర్తంలో 62 జంటలు పండితుల వేదమంత్రాల సాక్షిగా ఒక్కటయ్యాయి. – వజ్రపుకొత్తూరు రూరల్

అధికారుల్లో ఎన్నికల వేడి



- ఆర్‌ఓల నియామకం
- కంట్రోల్ రూం ఏర్పాటు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరవుతున్నాయి. శనివారం ఎన్నికలకు సంబంధించిన షెడ్యూలు విడుదల కావడం, ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో అధికారులు తదుపరి ఏర్పాట్లలో తలమునకలయ్యారు. జిల్లాలో ఒక పార్లమెంట్, 8 ఎమ్మెల్యే స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే నియోజకవర్గస్థాయిలో ఎన్నికల అధికారులను నియమించారు. వారు ఇప్పటికే ఆయా నియోజకవర్గాల పనుల్లో నిమగ్నమయ్యారు.

కంట్రోల్ రూమ్..

ఎన్నికల నేపథ్యంలో కొత్తగా నిర్మాణంలో ఉన్న సమగ్ర నూతన కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఈ ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను ఏర్పా టు చేశారు. ఇందులో ప్రస్తుతం ఆరు విభాగాలు పనిచేస్తున్నాయి. మీడియా సెల్, కంప్లైంట్ మానిటరింగ్ సెల్, సి విజిల్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ విభాగాలను ఏర్పాటు చేశారు.

నాడు–నేడు

సబ్జెక్టు	2019	2024
ఎన్నికల ప్రకటన	10-03-2019	16-03-2024
నోటిఫికేషన్	18-03-2019	18-04-2024
నామినేషన్‌లకు చివరి రోజు	25-03-2019	25-04-2024
నామినేషన్ల పరిశీలన	26-03-2019	26-04-2024
ఉపసంహరణకు చివరిరోజు	28-03-2019	29-04-2024
పోలింగ్ తేదీ	11-04-2019	13-05-2024
ఓట్లు లెక్కింపు	23-05-2019	04-06-2024
ఎన్నికల ముగింపు	27-05-2019	06-06-2024

ఆర్‌ఓలు వీరే..

శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం	జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి
ఇచ్ఛాపురం శాసన సభా నియోజకవర్గానికి	ఎస్‌డీసీ, కెఆర్‌సీ, శ్రీకాకుళం
పలాస	ఆర్డీఓ పలాస
టెక్కలి	సబ్ కలెక్టర్, టెక్కలి
పాతపట్నం	ఎస్‌డీసీ, ఎఫ్ఎస్ఓ, శ్రీకాకుళం
శ్రీకాకుళం	ఆర్డీ, శ్రీకాకుళం
ఆమదాలవలస	జేసీ శ్రీకాకుళం
ఎచ్చెర్ల	ఎస్‌డీసీ కొవ్వాడ యూనిట్, శ్రీకాకుళం
నరసన్నపేట	ఎస్‌డీసీ ఎల్ఏ యూనిట్ – 4

హెల్ప్ లైన్ నంబర్ (ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు)
1950
టోల్ ఫ్రీ నంబర్ 18004256625
డీసీసీ 08942 240606, 295084

ఎన్నికల షెడ్యూలు ఇలా

ఈ సారి ఎన్నిక షెడ్యూలు సుమారుగా ఒక నెల ఆలస్యంగా విడుదలైంది. 2019లో ఈ షెడ్యూల్ మొత్తం ఒక నెల ముందు నడిచింది. అంతే కాకుండా 2019లో తొలి విడతలో మనకు పోలింగ్ జరిగింది. ఈ సారి 4వ విడతలో పోలింగ్ జరగనుంది. దీంతో గత ఎన్నికల్లో పోలింగ్ తేదీకి ఈ సారి ఎన్నిక పోలింగ్ తేదీ సుమారుగా ఒక నెల తేడా ఉంది. ఈ సారి ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రచారానికి ఎక్కువ గడువు లభించింది.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి


శివశంకర్(ఫైల్)

మందస: మండలంలోని సిరిపురం గ్రామంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో బి.శివశంకర్(21) మృతి చెందాడు. సిరిపురంలో మేడ మీద పని చేస్తుండగా, శివశంకర్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తక్షణమే సిరిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108 అంబులెన్స్ సిబ్బంది జి.శంకర్, వి.మురళీమోహన్ పలాసలోని సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కొండపైన గిరిజనుడు మృతి


చిరంజీవి (ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని బొరిగిపేట పంచాయతీ పరిధి వంగర గ్రామానికి చెందిన పులిబంద చిరంజీవి(37) అనే వ్యక్తి కొండపైన మృతి చెందాడు. చిరంజీవి తన పశువుల మేత కోసం చెట్టు కొమ్మలు తెచ్చేందుకు గాను ఈ నెల 14వ తేదీ గురువారం ఉదయం తన గ్రామ సమీపంలోని ఉన్న కొండపైకి వెళ్లి తిరిగి రాలేదు. ఆ రోజు నుంచి గ్రామస్తులు కొండ ప్రాంతంలో గాలింపు చర్యలు చేట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ పి.పైడయ్య ఆధ్వర్యంలో వెతికినా దొరకలేదు. అయితే ఆదివారం కొంత మంది వ్యక్తులు కొండపైకి వెళ్లగా దుర్వాసన రావడంతో వెళ్లి చూడగా అక్కడ చిరంజీవి మృతదేహం గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందివ్వడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కొమ్మల కోసం వెళ్లిన చిరంజీవి తనతో తీసుకువెళ్లిన కత్తితో కొమ్మను కొడుతుండగా కత్తి విద్యుత్ లైన్‌కు తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఘటన జరిగి నాలుగు రోజులు కావడంతో అక్కడే శవ పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై అతని భార్య పులిబంద గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు సమీప క్వారీలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఘనంగా ఫేర్‌వెల్



బీఎస్సీ పారామెడికల్ విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: బొల్లినేని మెడిస్కిల్స్ బీఎస్సీ పారామెడికల్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ డ్యాన్స్‌లు, స్టెప్పులతో అదరగొట్టారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మంచిగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. పీజీ పూర్తి చేసి విదేశాల్లో ఉద్యోగావకాశాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా సంస్థ అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీపద్మజ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉన్నత స్థాయిని సాధించాలని ఆంధ్ర, తెలంగాణ, నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రవేశాలను పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎన్ స్వామి, ప్రియపాల్, శ్రవణ్, రామ్మోహన్, అషేర్, ఏసుపాద ,అరుణ, దేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీఓ ఫిర్యాదు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఎంపీడీఓ ఎచ్చెర్ల పద్మజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పంచాయతీ కార్యదర్శి పి.నిర్మల, ఆమె కుమారుడిపై కోటబొమ్మాళి ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఎన్నికల కోడ్ వచ్చినందున కొత్తపేటలోని రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను ఆదివారం మధ్యాహ్నంలోగా తొలగించాలని ఎంపీడీఓ పద్మజ పంచాయతీ కార్యదర్శి నిర్మలను ఆదేశించారు. అయితే ఆ పనిలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వహించారని ఎంపీడీఓ ప్రశ్నించారు. దీంతో కార్యదర్శిపైతో పాటు ఆమె కుమారుడు తనపై దాడికి దిగారని ఎంపీడీఓ ఫిర్యాదులో పేర్కొన్నారు.

జిల్లా కేంద్రంలో పోలీసుల మార్చ్‌పాస్ట్


మార్చ్‌పాస్ట్ చేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులోకి వచ్చినందున ఎస్ఐ బలివాడ గణేష్ ఆధ్వర్యంలోని ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి నగరంలో మార్చ్ పాస్ట్ నిర్వహించారు. 30 మంది వరకు పోలీసు సిబ్బంది హయాతినగరం నుంచి జిల్లా పరిషత్ వరకు మార్చ్‌పాస్ట్ చేశారు. కోడ్ అమల్లో ఉన్నందున నగరంలో పౌరులు రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితుల్లో తప్ప అర్ధరాత్రి దాటేవరకు తిరగరాదని అన్నారు.

మాటిచ్చారు.. నెరవేర్చారు

- తూర్పు కాపుల సామాజిక భవన నిర్మాణానికి 50 సెంట్ల స్థలం మంజూరుపై హర్షాతిరేకాలు
- సీఎం వైఎస్ జగన్, మంత్రులు బొత్స, ధర్మానల కృషిపై ప్రశంసలు


స్థలం కేటాయిస్తూ జారీచేసిన జీఓను చూపిస్తున్న తూర్పుకాపులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తూర్పుకాపులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి సామాజిక భవన నిర్మాణానికి 50 సెంట్ల స్థలం కేటాయించడంపై జిల్లాలో తూర్పుకాపులంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పాదయాత్రలో తూర్పుకాపులంతా కలిసి తమకు సామాజిక భవన నిర్మాణానికి స్థలం కావాలని విన్నవించారు. అధికారంలోకి వచ్చాక తప్పనిసరిగా స్థలం కేటాయిస్తామని ఆనాడే వైఎస్ జగన్ మాటిచ్చారు. ఇప్పుడు ఆ మాటను నిలబెట్టుకున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రత్యేక చొరవ చూపి స్థలం కేటాయించడంతో పాటు వాస్తవ ధరను తగ్గించి స్థలాన్ని ఇవ్వడంపై తూర్పుకాపులు సంతోషం వ్యక్తం చేశారు. భవన నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ సుమారు రెండు నెలలపాటు విజయవాడలో ఉండి ప్రభుత్వం నుంచి జీఓ జారీచేసేందుకు కృషి చేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంపీ స్వరూప్ కూడా సహకారం అందజేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నేరుగా సీఎంతో మాట్లాడి స్థలం కేటాయించడంలో కీలకపాత్ర పోషించారు. దీంతో తూర్పుకాపుల దశాబ్దాల కల నెరవేరింది. దీంతో వారు ప్రభుత్వాన్ని వేనోళ్ల కీర్తిస్తున్నారు.

సీఎం రుణం తీర్చుకోలేనిది



పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ తూర్పుకాపులకు 50 సెంట్ల స్థలం కేటాయించారు. చెప్పాడంటే.. చేస్తాడంతే అనడంతో అతిశయోక్తి లేదు. స్థలం కేటాయింపులో పూర్తిసహాయ సహకారాలు అందించిన మంత్రి ధర్మాన ప్రసాదరావుకి, బొత్స సత్యనారాయణలకు కృతజ్ఞతలు. సీఎం రుణం తీర్చుకోలేనిది.

– మామిడి శ్రీకాంత్, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్

పండగ రోజు



ఈ నెల 15వ తేదీన తూర్పు కాపులకు స్థలం కేటాయిస్తూ జీఓ జారీ చేయడం ఓ పండగ వంటిది. గత ప్రభుత్వాలన్నీ మమ్మల్ని విస్మరించా యి. ఓటు బ్యాంకుగా చూశాయే తప్ప గుర్తించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే తూర్పుకాపుల అభివృద్ధి సాధ్యపడుతుంది.

– పిన్నింటి సాయి, ఎంపీపీ ప్రతినిధి, రణస్థలం, ఎచ్చెర్ల నియోజకవర్గం.

కల నెరవేరింది



తూర్పుకాపులకు జిల్లా కేంద్రంలో సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించడం అభినందనీయం. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నా ఇప్పటివరకు ఏ ప్రభుత్వం స్థలం కేటాయించలేదు. కేవలం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమైంది.

– కొండాల గణేష్, తూర్పుకాపు సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్.

మాట నిలబెట్టుకున్నారు



దశాబ్దాల కల సీఎం జగన్ మోహన్‌రెడ్డి రూపంలో నెరవేరింది. పాదయాత్రలో తూర్పుకాపులంతా కలిసి వినతి పత్రం ఇచ్చాం. అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం స్థలం కేటాయిస్తూ జీఓ ఇచ్చారు.

– సలాన చిరంజీవి, రిటైర్డ్ ఎంపీడీఓ, పాతపట్నం నియోజకవర్గం.

ఇక జగన్ వెంటే



తూర్పుకాపులంతా జీవితకాలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటాం. ఇప్పటివరకు ఎవరూ మమ్మల్ని గుర్తించలేదు. 50సెంట్ల స్థలం ఇవ్వడమంటే అంత సులువు కాదు. జగనన్నకు మా మీద అభిమానం ఏ స్థాయి ఉందో అర్థమైంది.

– పట్నాన శాంతారావు, నరసన్నపేట నగర తూర్పుకాపు సంఘ కార్యదర్శి.

మాకు వరం



జిల్లాలో ఎంతోమంది నిరుపేద తూర్పుకాపులకు సామాజిక భవనం ఎంతో ఉపయోగపడుతుంది. సీఎం జగనన్న ఇచ్చిన స్థలంలో భవన నిర్మాణం చేసి నిరుపేదలు చదువుకునేందుకు ఉపయోగిస్తాం.

– కనుగుల కిశోర్, న్యాయవాది, బెలమాం, ఆమదాలవలస నియోజకవర్గం.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక

శ్రీకాకుళం పాతబస్టాండ్:


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో ఆదివారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండి విధులను నిర్వహించాలని ఆదేశించారు. సి-విజిల్, ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాలపై పర్యవేక్షించేందుకు ఎంసీసీ బృందాలు, ఖర్చుల పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారులను ఆదేశించారు. కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్ట్రోరల్ రోల్‌పై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే వాహనాలు సమకూర్చామని, వాటికి జీపీఎస్ అమర్చినట్టు తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నూరుల్ అహ్మద్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ఆర్డీఓలు సీహెచ్ రంగయ్య, భరత్ నాయక్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతి శ్రీ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాణీ మోహన్, సీపీఓ ప్రసన్న లక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్య కిరణ్, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ కుమార్, డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, సెబ్ అధికారి తిరుపతి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ చంద్రరావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్న కేశవరావు తదితరులు హాజరయ్యారు.

20న ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ 15వ బ్యాచ్ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో 20వ తేదీ 15వ బ్యాచ్ ప్రారంభిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏపీఎస్‌ఆర్టీసీలో మాత్రమే హెవీ డ్రైవింగ్ స్కూల్ ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఆర్టీసీలో డ్రైవర్లకు శిక్షణతో పాటు, హెవీ లైసెన్స్ ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకునేటప్పుడు ఒక రోజు ట్రైనింగ్ సర్టిఫికెట్టు ఉండాలని అన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్‌కి వెళ్లే ప్రతి ఒక్కరు కూడా శ్రీకాకుళం ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌కి వచ్చి ఒకరోజు ట్రైనింగ్ తీసుకుని ట్రైనింగ్ సర్టిఫికెట్‌ని రవాణా శాఖకు సమర్పించేలా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఆర్టీసీలో ట్రైనింగ్ తీసుకున్నటువంటి డ్రైవర్లకు ఆర్టీసీతో పాటు మిగతా అన్ని డిపార్ట్‌మెంట్‌లలో కూడా మంచి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కొత్త విధానంలో లైసెన్స్ కూడా ఇప్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఫీజు, ఇతర వివరాల కోసం 9963091999 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఇంటర్ స్పాట్

- ఏర్పాట్లు పూర్తి
- మార్కుల స్కానింగ్ కూడా ఇక్కడే


మూల్యాంకనం చేస్తున్న ఎగ్జామినర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. అయితే ఈనెల 9వ తేదీ నుంచి సంస్కృతం పేపర్ల దిద్దుబాటు ప్రక్రియ మొదలైంది. శ్రీకాకుళం ప్రభుత్వ (బాలుర) జూనియర్ కళాశాలలో ఈ నెల 18 నుంచి ప్రారంభంకానున్న ఈ మూల్యాంకనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మూల్యాంకనం నిర్వహించే గదులను ఇప్పటికే నాడు-నేడులో భాగంగా ప్రభుత్వం ఆధునికీకరించింది. సరికొత్త ఫర్నిచర్, ఫ్యాన్లు, లైటింగ్, మరుగుదొడ్లు ఇలా అన్ని వసతులు, సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో అధికారులకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ గదులన్నింటిలోనూ ఇప్పటికే సీసీ కెమెరాలు అమర్చారు. వీటిని ఆన్‌లైన్ స్ట్రీమ్ చేయనున్నారు. పునర్విభజన శ్రీకాకుళం జిల్లాకు 2.60 లక్షల జవాబు పత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. ఒక ఎగ్జామినర్ పూటకు 15 చొప్పున రోజుకు 30 పేపర్లు దిద్దాల్సి ఉంటుంది. ఒక పేపర్ (స్క్రిప్ట్)కు రూ.23.66 పైసలు చెల్లిస్తారు. ఈ లెక్కన రోజుకు రూ.709.66లు చెల్లించనున్నారు. వీటితోపాటు టీఏ, డీఏ, లోకల్ కన్వీయన్స్/అవుట్‌స్టేషన్ అలవెన్స్ ఇలా చెల్లించే మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు.

అధికారులు, ఎగ్జామినర్ల నియామకం పూర్తి..

ఎగ్జామినర్ల నియామక ఆర్డర్లను ఇంటర్మీడియెట్ బోర్డు ఇప్పటికే కళాశాలలకు చేరవేసింది. పేపర్ వాల్యుయేషన్ ప్రక్రియలో భాగంగా స్పాట్ క్యాంప్ ఆఫీసర్‌గా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు వ్యవహరిస్తున్నారు. జనరల్-1 గణపతి వెంకటేశ్వరరావు (ఇన్‌చార్జి ప్రిన్సిపాల్- జీజేసీ శ్రీకాకుళం బాలురు), జనరల్-2గా పి.శివరాంప్రసాద్ (ఫిజిక్స్ జేఎల్- శ్రీకాకుళం బాలురు), సీసీవో-1 జెన్నెల సునీత (ప్రిన్సిపాల్-జేజీసీ కింతలి) సీసీఓ-2 బొమ్మలాట శ్యామ్‌సుందర్ (ప్రిన్సిపాల్-జీజేసీ ఆమదాలవలస) అలాగే కోడింగ్ ఆఫీసర్లు, ఏసీవోలు, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్క్రూటినైజర్లు నియామక ప్రక్రియ పూర్తయ్యింది.

మార్కుల స్కానింగ్ ఇక్కడే..

ఇంటర్మీడియెట్ జవాబుపత్రాల దిద్దుబాటులో సరికొత్త సాంకేతికను ప్రభుత్వం అందిపుచ్చుకుంటోంది. గతంలో మార్కుల స్కానింగ్‌ను విజయవాడ ఇంటర్‌బోర్డు కార్యాలయంలో మాత్రమే జరిపేవారు. దీనివాళ్ల అనేక వ్యయప్రయాసలతో పాటు ఫలితాల వెల్లడిలో జాప్యం జరిగేది. కానీ ఈ ఏడాది మార్కుల కూడిన పార్ట్-3ల స్కానింగ్‌కు ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే రెండేసి స్కానర్లను ఏర్పాటు చేశారు. ఈ రెండు స్కానర్ల ద్వారా రోజుకు 30వేల వరకు పార్ట్-3 మార్కులను స్కానింగ్ పూర్తిచేయవచ్చు. ఏ రోజు దిద్దిన పేపర్లను ఆ రోజే ఇద్దరు స్కానింగ్ టెక్నీషియన్లు, కంప్యూటర్ నిష్ణాతులు స్కాన్‌చేసి త్వరితగతిన పనిని పూర్తిచేయనున్నారు. ఫలితాలను కూడా దాదాపు 22 రోజుల్లో వెల్లడించే అవకాశం ఉంది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లాలో ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. సిబ్బంది నియామకం పూర్తయ్యింది. నియామక ఉత్తర్వులు కళాశాలల లాగిన్‌లో సిద్ధంగా ఉన్నాయి. వారివారి స్పెల్స్‌ను బట్టి విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదు. సీసీ కెమెరాలను అమర్చి, స్ట్రీమింగ్ చేపించాం. బోర్డు ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షిస్తారు.

– ప్రగడ దుర్గారావు, ఆర్ఐఓ/ఇంటర్ స్పాట్ క్యాంప్ ఆఫీసర్ శ్రీకాకుళం

'కాళింగ సామాజిక వర్గం ఐక్యతతో మెలగాలి'


కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రామారావును సన్మానిస్తున్న స్పీకర్ తమ్మినేని, పేరాడ తిలక్ తదితరులు


పాల్గొన్న కాళింగ సామాజిక వర్గం నాయకులు

పొందూరు: జిల్లాలో అత్యధిక సంఖ్యలో ఉండే కాళింగ సామాజిక వర్గం ఐక్యంగా మెలిగి నవ సమాజ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఇటీవలే కాళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన దుంపల రామారావు(లక్ష్మణరావు)కు ఆదివారం తోలాపి గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 20 ఏళ్ల ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేసిన వలంటరీ రిటైర్మెంట్ ఇచ్చి ప్రజా సేవ చేస్తున్న దుంపల రామారావుకు కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం ముదావహమన్నారు. ఏబీసీఎఫ్ వ్యవస్థాపకులు జస్టిస్ ఈశ్వరయ్య శిష్యరికంలో రామారావు బీసీలకు సేవలందించారని కొనయాడారు. శ్రీకాకుళం ఎంపీగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్‌ను, ఆమదాలవలస ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను గెలిపించాలని అభ్యర్థించారు. శ్రీకాకుళం ఎంపీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ రామారావు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఉపాధ్యాయ సంఘాల నాయకునిగా సేవలందించారని కొనియాడారు. ఏబీసీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా జాతీయ కార్యదర్శిగా సేవలందించారని చెప్పారు. ఉపాధ్యాయ వృత్తిని పక్కన పెట్టి ప్రజా సేవ చేస్తున్నందుకు సీఎం, స్పీకర్ గుర్తించారని అన్నారు. కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు మాట్లాడుతూ కాళింగ సామాజిక వర్గానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే మూడు ఎమ్మెల్యే స్థానాలను, ఒక ఎంపీ స్థానాన్ని కాళింగ సామాజిక వర్గానికి కేటాయించడమే దీనికి నిదర్శనమని చెప్పారు. విద్య అభివృద్ధి పథంలో నడిచే చోట సమాజం అభివృద్ధి బాటలో నడుస్తుందని స్పీకర్ నమ్ముతుండటంతో ఆమదాలవలస నియోజకవర్గంలో పది ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటు చేయించారని చెప్పారు. కార్యక్రమంలో కూటికుప్పల సూర్యారావు, ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, సర్పంచ్ పప్పల చిన్నమ్మాయమ్మ, పప్పల రాధాకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, బాడాన సునీల్‌కుమార్, బాడాన కృష్ణ, కిల్లాన సూర్యారావు, కూన రమణమ్మ, ఏబీసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ నాయకుడు, ఐహెచ్‌ఆర్ఏఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామమోహనరావు, చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు గొండు సీతారాం, ఏబీసీఎఫ్ ప్రతినిధి బొడ్డేపల్లి దామోదరరావు పాల్గొన్నారు.

పార్టీలు సహకరించాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్:


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేస్తున్నామని, అందులో భాగంగానే రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, జెండాలు వంటివన్నీ తొలగిస్తున్నామని, ఆయా పార్టీల నేతల విగ్రహాలు కనిపించకుండా వస్త్రాలతో కప్పి ఉంచుతామని తెలిపారు. ఈ మేరకు ఆయన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆదివారం ఉదయం రానున్న ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీలు చేయాల్సిన, చేయకూడని అంశాలను ఈ సందర్భంగా వివరించారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతాను ప్రారంభించి ప్రతి ఖర్చును రిజిస్టర్‌లో నమోదు చేయాలని, అభ్యర్థుల ఖర్చుల వివరాలపై అధికారికంగా షాడో రిజిస్టర్‌ను కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ముద్రించే కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు తదితర వాటికి ముందస్తుగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటి అనుమతి పొందాలని, ప్రింట్, ఎలక్ట్రానిక్ (సినిమా థియేటర్లు, కేబుల్ టీవీ నెట్వర్క్, ఈ పేపర్లు) మీడియా, సోషల్ మీడియాలో జారీ అయ్యే ఎన్నికల ప్రకటనలను రేట్ల ఆధారంగా అభ్యర్థి ఖర్చులో జమ చేయనున్నామని చెప్పారు. నామినేషన్ ముగిసేంత వరకు వ్యయ పరిశీలన బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయని, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీం, వీడియోగ్రఫీ టీమ్‌లు ఎప్పటికప్పుడు రికార్డు చేస్తాయని వారికి సహకారం అందించాలన్నారు. ప్రచార ఖర్చులు ఇతర ఖర్చులకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్‌ను మెయింటెన్ చేస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులు, పోలీసులకు సహకరించాలని, అనుమతి తీసుకున్న వాహనాల కంటే ఎక్కువ వాహనాలు ఉంటే వాటి అనుమతిని రద్దు చేస్తామని, ఒకరు తీసుకున్న వాహనాన్ని వేరే అభ్యర్థి వినియోగించరాదన్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై ఈసీఐ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ఎన్నికల ఫిర్యాదులపై 24 గంటలు పని చేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ పని చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన బుక్‌లెట్‌ను ప్రతినిధులకు అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్న కేశవరావు, రౌతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పీఎంజే బాబు (టీడీపీ), చింతపల్లి గాంధీ (బీజేపీ), జి. సింహాచలం (సీపీఎం), లాస సోమేశ్వరరావు (బీఎస్పీ) తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సందడి


నిత్యాన్నదాన ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శనాలు చేసుకున్నారు. ఉదయం 6 గంటల నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు సూర్యోదయ సమయానికి పుష్కరిణి ఆవరణలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఏర్పాట్ల విషయంలో కూడా ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్వామి వారి మూలవిరాట్టును అలంకరించి దర్శనానికి అనుమతించారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,02,300, విరాళాల ద్వారా రూ.88,790, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.95 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ తెలిపారు. ఆలయ పాలకమండలి సభ్యులు ఎస్.కోటేశ్వర చౌదరి, లుకలాపు గోవిందరావుతో పాటు సింహాచలం దేవస్థాన పాలకమండలి సభ్యులు ఎన్.నాయుడు తదితరులు ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.